క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి గురువారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అమ్మవారిని దాతలు అందించిన పుష్పాలతో అలంకరించినట్లు పూజారి నేతేటి ప్రశాంత్ తెలిపారు. అనంతరం అమ్మవారికి బూరెలతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.

చిన్నారుల రక్షణపై శ్రద్ధ వహించండి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పూసపాటిరేగ: అంగన్‌వాడీ చిన్నారుల రక్షణపై సిబ్బంది శ్రద్ధ వహించాలని భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. మండలంలోని కనిమెట్ట గ్రామంలో 1000 రోజుల పోషణ్‌పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక పోషకాలు అందించే ఆహార పదార్థాలను చిన్నారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



ఎంపీడీఓ రాధికకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పూసపాటిరేగ: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. అర్హత, అనుభవం బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జీవో 35 సవరణకు డిమాండ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నాయకులు

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన జీవో నంబర్ 35తో జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న పరిపాలన అధికారులకు ఎంపీడీఓ ఉద్యోగోన్నతి కోటాలో తీరని అన్యాయం జరుగుతోందని, తక్షణమే జీఓను సవరించాలని ఏపీ పీఆర్ ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మురళి, వి.రాంబాబు, ఎన్జీఓ సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడారు. పంచాయతీ విస్తరణ అధికారులకు 33 శాతం నేరుగా, ఎంపీడీఓల నియామకానికి 30 శాతం, ఇతరులకు 3 శాతం కేటాయింపులు ఇప్పటికే జరిగాయన్నారు. ఎంపీడీవోలుగా నేరుగా నియామక కోటాను రద్దు చేసినందున ఉద్యోగోన్నతిలో 50 శాతం కేటాయించాలని, కేవలం 34 శాతం కేటాయించడం అన్యాయమన్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో పనిచేస్తున్న పరిపాలన అధికారులకు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబర్డినేట్లకు తీరని నష్టం జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్ ఏవోలు త్రినాథ్, చైనులు వేదవతి, రాజేశ్వరి, ఎం.ఎల్.ఎన్.ప్రసాద్, బంగారయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొండపల్లి: అంబటివలస గ్రామంలోని ఎర్ర చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ కె.తులసీనాథ్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వేతనదారులతో ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని చెప్పారు. ఆయన వెంట స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

కల్యాణ వైభోగమే..

- ప్రారంభమైన శుభ ముహూర్తాల సందడి
- జూన్ వరకు జిల్లాలో మోగనున్న పెళ్లి బాజాలు



వివాహ వేడుకకు సిద్ధమైన కల్యాణ మండపం

విజయనగరం: శుభ ముహూర్తాలకు వేళయింది. నూతనంగా దాంపత్య జీవనం ప్రారంభించేందుకు తహతహలాడుతున్న వారికి మాఘమాసం తన వెంట మంచి ముహూర్తాలను తీసుకువచ్చింది. వరుస మహూర్తాలు ఉండడంతో జిల్లాలో పెళ్లిళ్ల సందడి ప్రారంభమైంది. ఇన్నాళ్లూ కల్యాణ ఘడియల కోసం వేచి చూస్తున్న యువతీ యువకులకు మంచి రోజులొచ్చాయి. గత నెల 19 నుంచి 29వ తేదీ వరకు మూఢం కారణంగా శుభ ముహూర్తాలకు బ్రేక్ పడింది. ఏప్రిల్ 3 నుంచి మంచి రోజులు ప్రారంభం కాగా.. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎక్కువగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇందుకోసం కల్యాణ మండపాలు సిద్ధంగా ఉన్నాయి. పురోహితులు, అలంకరణ నిపుణులు, సన్నాయి మేళం, వంటమేస్త్రీలు, క్యాటరింగ్, బ్యూటీషియన్లు, ఫొటో, వీడియోగ్రాఫర్లతో పాటు వివిధ రంగాల్లో పని చేసే కార్మికులకు దాదాపు మూడు నెలల పాటు చేతినిండా పనిదొరకనుంది.

మూడు నెలల పాటు..

ఈ నెల 12న చైత్రమాస పూర్ణిమ, హస్తా నక్షత్రం శుభదాయకమైన ముహూర్తం. ఆ రోజు అధికంగా వివాహాలు జరగనున్నాయి. అలాగే మే 10వ తేదీ నుంచి 28 వరకు వివాహాలు మంచి ముహూర్తాలున్నాయి. మళ్లీ జూన్ 11 నుంచి జులై 12 వరకు గురు మూఢమి అయినందున ముహూర్తాలు, శుభ కార్యక్రమాలకు విరామం ఉంటుంది. శ్రావణ మాసం నుంచి శుభ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయి. ఈ ఏడాది వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. విశ్వావసు నామ సంవత్సరం అందరికీ శ్రేయోదాయకమని పండితులు చెబుతున్నారు.

కల్యాణ మండపాలకు పెరిగిన డిమాండ్..

విజయనగరం జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 వేల నుంచి 5 వేల వరకు కల్యాణ మండపాలున్నాయి. విజయనగరం జిల్లా కేంద్రం సహా పలు పట్టణాల్లో నాన్ ఏసీ కల్యాణ మండపాల్లో వేడుక నిర్వహించుకునేందుకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అన్ని సౌకర్యాలుండే ఏసీ కల్యాణ మండపాలకు అంతకు మూడింతలు మొత్తం అధికంగా చెల్లించాల్సి వస్తుంది. సౌకర్యాలు, సీజన్ బట్టి కొన్నిచోట్ల రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు తీసుకుంటున్నారు. ఆయా తేదీల ప్రకారం ముందుగానే వారి ఆర్థిక స్థోమత కొద్దీ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. ఇక భోజనాల కోసం క్యాటరింగ్ వారిని నియమించుకుంటున్నారు. సాధారణ భోజన ప్లేట్ ధర రూ.200 నుంచి ప్రారంభమవుతుండగా.. వివిధ రకాల పదార్థాలతో ఖరీదైన భోజనం రూ.700కు పైమాటే పలుకుతోంది. అదేవిధంగా ఊరేగింపులో సందడి చేసే డీజే మ్యూజిక్‌లు, బ్యాండ్ మేళాలు, పురోహితులకు ఎప్పటిలాగే డిమాండ్ ఉంది. ఇదిలా ఉండగా పెళ్లికి అవసరమైన వస్త్రాలు, బంగారు ఆభరణాల కొనుగోళ్లతో దుకాణాలు కళకళలాడుతున్నాయి.

మంచి ముహూర్తాలున్నాయి..

ఈ నెల 3 నుంచి మంచి ముహూర్తాలున్నాయి. జూన్ 9 వరకు జిల్లా వ్యాప్తంగా వేలాది పెళ్లిళ్లతో పాటు వివిధ శుభ కార్యక్రమాలు జరగనున్నాయి. ఇప్పటికే చాలా మంది వివాహ ముహూర్తాలను నిర్ణయించుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జూన్ 10 నుంచి నుంచి మూఢం ప్రారంభం అవుతుండగా.. మళ్లీ శ్రావణం వరకు మంచి రోజులు లేవు.

–పి.కామేశ్వర శర్మ, వేదపండితుడు

వితరణ..



పూసపాటిరేగ మండలంలోని తాళ్లపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో పూజా కైంకర్యాలు నిర్వహించేందుకు కొవ్వాడ సర్పంచ్ కోటర్ల రఘు లక్ష రూపాయలను గురువారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాళ్లె అక్కునాయుడు, వాళ్లె సత్యం, తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ

వినతి



నెల్లిమర్ల మండలంలో ఈ నెల 14 నుంచి జరగనున్న గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పనుల గుర్తింపు, మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపట్టే సభల లక్ష్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. రోజుకు ఒక్క గ్రామంలోనే సభ నిర్వహించాలని, అధికారులంతా హాజరు కావాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అధ్యక్షుడు చందక రమణ, కార్యదర్శి సూర్యం, సభ్యులు కెల్ల రమణ, తదితరులు ఉన్నారు. – నెల్లిమర్ల

లీకులు... మరమ్మతులు..



విజయనగరం కార్పొరేషన్ పరిధిలో పైప్ లైన్ల లీకేజీలతో తాగునీటి సరఫరాలో తరుచూ ఇబ్బందులేర్పడుతున్నాయి. తాజాగా నగరంలోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ లీకవడంతో స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు గురువారం మరమ్మతులు చేపట్టారు. స్థానిక కొత్తపేట, బాబామెట్ట, సాకేటివీధి, తదితర ప్రాంతాలలో ఏర్పడిన లీకేజీలకు మరమ్మతులు చేపట్టినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రాయల్‌బాబు తెలిపారు. – విజయనగరం

సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు

పూసపాటిరేగ: సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ గో సంరక్షణ అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. మండలంలోని కందివలస సంతలో గురువారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ 23 ప్రకారం పశువులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సంతలలో నీటి కుండీలు, షెడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జంతువులపై హింస జరగకుండా 12 రకాల మార్గదర్శకాలు పాటించాలన్నారు. ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. పశువులను అక్రమంగా తరలించడం నేరమన్నారు. సంతలలో పశువులను హింసిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీవీ మాధురి, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, పశువైద్యాధికారి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

- ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముంజేరు, భోగాపురం సర్పంచ్‌లు పూడిక సూకరాజు, ఉడికల అప్పయ్యమ్మ మాట్లాడుతూ..

తమ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీపీ అనూషారెడ్డి స్పందిస్తూ.. రెండు గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్‌కు సూచించారు. మత్స్యశాఖ అధికారి చాందిని మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయం వల్ల చేపలవేటపై నిషేధం ఉంటుందన్నారు. ఇప్పటికే మత్స్యకార భరోసాకు ప్రపోజల్ పెట్టామన్నారు. అయితే గత సంవత్సరం నుంచి ఇంత వరకు మత్స్యకారులకు ఎవరికీ మత్స్యకార భరోసా అందలేదని చెప్పారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దంతులూరి రావాడబాబు, పచ్చిపాల నాగలక్ష్మి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న, డిప్యూటీ తహసీల్దార్ సుభాష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ దాసన్నపేట సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోర్ట్ సిటీ స్కూల్, టౌన్ సెంటర్ లేఔట్, శ్రీనివాస్ నగర్, వినాయక్ నగర్, పీఎస్ఆర్ కాలనీ, కృష్ణరాజుపురం, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎస్ పురం, తుమ్మలపేట, చిన బూరాడపేట, పెద్ద బూరాడపేట, పారసాం, గెద్దపేట, తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. అలాగే రామతీర్థం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కూడా మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు..

భోగాపురం: మండలంలోని కొంగవానిపాలెం, మెట్టసబ్బన్నపేట, నందిగాం, తోటపల్లి, దిబ్బలపాలెం, చేపలకంచేరు, బమ్మిడిపేట, గాబువానిపేట, కొండ్రాజుపాలెం, రామచంద్రపేట పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మస్తావలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈనెల 20న జరగాల్సిన పరీక్ష 21వ తేదీ నాటికి వాయిదా వేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్టర్ పర్వదినం కావడంతో పరీక్షను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. 21వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని.. వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాని సూచించారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్షను ఈస్టర్ సందర్భంగా 21వ తేదీకి వాయిదా వేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమలత

గంట్యాడ: నరవ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు గంట్యాడ పీహెచ్ సీ వైద్యాధికారి హేమలత గురువారం వివిధ పరీక్షలు చేశారు.అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టిసారించగలరని చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ పద్మశ్రీవాణి

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో డీసీహెచ్ఎస్ (జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి) ఎస్.పి.పద్మశ్రీవాణి గురువారం తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో వార్డులు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు, వైద్యపరికరాల పని తీరు, మందుల నిల్వలు, ఓపీ, ఐపీ, ప్రసవాలు, శస్త్ర చికిత్సలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే రోగులతో మాట్లాడి వైద్యసేవలు, భోజనం సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, పలువురు వైద్యాధికారులు ఉన్నారు.

గ్రామస్థాయిలో నిఘా..

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: మండలంలో సారా తయారీ, వినియోగం ఎక్కడా జరగకుండా చూడాలని.. ఇందుకోసం గ్రామస్థాయిలో నిఘా పెట్టాలని ఎంపీపీ, నవోదయం 2.0 కమిటీ చైర్‌పర్సన్ అంబళ్ల సుధారాణి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవోదయం 2.0 కమిటీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సారా రహిత మండలంగా తీర్చిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఎక్సైజ్ సీఐ వెంకటరావు మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడా సారా తయారీ లేదన్నారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఏఎస్సై మూర్తి, డీటీ రవిశంకర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

- జేసీ సేతుమాధవన్

విజయనగరం టౌన్: జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్, జేసీ సేతు మాధవన్ అన్నారు. గురువారం స్థానిక జిల్లాశాఖ గ్రంథాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైబ్రరీ సెస్ పక్కాగా వసూలయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణ చెరలో ప్రభుత్వ భూమి



ప్రభుత్వ స్థలంలో తీసిన పునాదులు

విజయనగరం: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. 45వ డివిజన్ పరిధిలోని కేఎల్ పురం ప్రాంతంలో సర్వే నంబర్ 165/45 పరిధిలో 27 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమిలో కొంత మంది ఆక్రమణదారులు పునాదులు తీశారు. నిత్యం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సంచరించే ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు విలువైన స్థలంలో అనధికారిక నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది. మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలం రూ. 2 కోట్లకు పైగా ధర పలుకుతుందని స్థానికులు చెబుతున్నారు. రోడ్లపై వ్యాపారాలు సాగించే వారిపై కొరడా ఝులిపించే అధికారులు, ఇంతటి విలువైన భూమిని ఆక్రమిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా గోవిందరావు

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఆర్. గోవిందరావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 28 డీఎస్పీలకు పోస్టింగ్‌లు కేటాయించగా.. ఇందులో 17 మంది వెయిటింగ్‌లో ఉన్నవారికి కూడా స్టేషన్లు కేటాయించింది.